# దశ

నిజం.. నిర్భయంగా..

WWW. DASHANEWS .COM

బుధవారం 06 08 2025

సంపుటి 1 సంచిక 98

పేజీలు : 02

UDYAM / TS-09-0148996


## చరిత్రలో ఈ రోజు





**1809:** బ్రిటను కు చెందిన ప్రసిద్ధ ఆంగ్ల కవి టెన్నిసన్ జననం.

**1881:** నోబెల్ బహుమతి గ్రహీత, పెన్సిలిన్ కనిపెట్టిన శాస్త్రవేత్త సర్ అలెగ్జాండర్ ఫ్లెమింగ్ జననం.

**1934:** తెలంగాణ సిద్ధాంత కర్తగా పేరుపొందిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జననం

**1945:** రెండవ ప్రపంచ యుద్ధం లో అమెరికా , జపాను లోని హిరోషిమా నగరం మీద అణుబాంబు ప్రయోగించింది. ప్రపంచ హిరోషిమా రోజు గా పాటిస్తారు.

**1991:** వరల్డ్ వైడ్ వెబ్ (www) ఇంటర్‌నెట్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి వచ్చిన రోజు. అందుబాటులోకి తెచ్చిన వ్యక్తి టిమ్ బెర్నర్స్ లీ.






## స్పోర్ట్స్ హబ్ వైస్ చైర్మన్ గా చిరంజీవి కోడలు

తెలంగాణా స్పోర్ట్స్ హబ్ వైస్ చైర్మన్ గా మెగా స్టార్ చిరంజీవి కోడలు కొణిదెల ఉపాసనను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. చైర్మన్ గా సంజీవ్ గోయెంకా, మరో 14 మందిని పాలకవర్గ సభ్యులుగా నియమించింది. తన నియామకంపై ఉపాసన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

**దశ, హైదరాబాద్**



## జూనియర్లకు ఇచ్చారు.. నాకు ఇవ్వలేదు

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేసారు. నేను పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదు. నాకు పదవులు కాదు, ప్రజలు ముఖ్యమని అన్నారు. ఎల్బీ నగర్ నుంచి పోటీచేస్తే మంత్రి పదవి వచ్చేది.. అయినా మునుగోడు ప్రజలే ముఖ్యమని ఇక్కడ పోటీచేశానని అన్నారు. వేల కోట్లు దోచుకునే వాడికి పదవులు కావాలి. అప్పుడు..మంత్రి పదవి ఇస్తా అంటేనే కాంగ్రెస్ లోకి బ్యాక్ అయ్యా. జూనియర్ లకు మంత్రి పదవి ఇచ్చి.. నన్ను దూరం పెట్టారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి అనేది వాళ్ళ విజ్ఞత. మునుగోడు అభివృద్ధి మాత్రం నా బాధ్యత. పదవుల కోసం దిగజారి కాళ్ల పట్టుకునే నైజం నాది కాదు. వేల కోట్లు దోచుకునే వాడికి పదవులు కావాలి, నాకెందుకు పదవులు. మంత్రి పదవి కావాలా..? మునుగోడు ప్రజలు కావాలా..? అంటే మునుగోడు ప్రజలే కావాలని చెబుతానని అన్నారు. ప్రజల కోసం మరోసారి పదవి త్యాగానికైనా రెడీ.. బీఆర్ఎస్ హయంలో రాజీనామా చేసి ప్రభుత్వాన్ని మునుగోడు ప్రజల కాళ్ళ దగ్గరికి తెచ్చా. ప్రజల కోసం మళ్ళీ రాజీనామాకైనా రెడీ అని అన్నారు.

**దశ, నల్లగొండ**



## గడ్కరీతో కోమటిరెడ్డి భేటీ

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ భేటీలో ఎంపీలు సురేష్ షెట్కర్, గడ్డం వంశీకృష్ణ, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రఘురామిరెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణలో జాతీయ రహదారులు ప్రాజెక్ట్స్ పై ప్రధాన చర్చ,పలు వినతులు మంత్రి ఇచ్చారు. హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి పై ఎల్ బి నగర్ నుండి హయత్ నగర్ వరకు నిర్మిస్తున్న డబుల్ డెక్కర్ కారిడార్ వే కు కేంద్ర సహకారం పై చర్చ జరిగింది. హైదరాబాద్ అమరావతి మధ్య గ్రీన్ ఫీల్డ్ హై వే నిర్మాణం పైన కుడా చర్చించారు.

**దశ, ఢిల్లీ**

# ఎన్ ఆర్ ఐలనూ ముంచేశారు


**బయట పడుతున్న ‘సృష్టి’ నమ్రత మోసాల చిట్టా ✥ 2019 నుండి 2025 మధ్య భారీగా నగదు క్రెడిట్**


**తాజాగా ఈ కేసులో మరో డాక్టర్ విజ్జులత ప్రమేయం..**

**విదేశాలకు పారిపోతుండగా శంషాబాద్ ఎయిర్ పోర్టులో అదుపులోకి...**

**దశ, హైదరాబాద్:** సరోగసి పేరుతో సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ చేసిన మోసాల చిట్టా ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. తాజాగా మరో ఐదుగురు బాధితులను సరోగసి పేరుతో మోసం చేసి గట్టిగానే వసూలు చేశారని తేలింది. తెలుగు రాష్ట్రాలలోనే కాదు, దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలతో పాటు ఎన్ ఆర్ ఐలను సైతం నిండా ముంచేశారని తాజాగా బయటపడింది. ఇదిలా ఉంటే నమ్రతా బ్యాంక్ ఖాతాలతోపాటు, సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ బ్యాంక్ లావాదేవీలను పరిశీలించిన అధికారులు భారీగా నగదు బదిలీలు జరిగినట్లుగా గుర్తించారు.సికింద్రాబాద్ లో సృష్టిఫెర్టిలిటీ సెంటర్ మోసాలను రాజస్థాన్ దంపతులు బయటపెట్టిన నాటి నుండి వేగంగా పరిణామాలు మారుతున్నాయి. ఇప్పటికే నమ్రతను ఐదురోజుల కస్టడీకి తీసుకున్న గోపాలపురం పోలీసులు, నేటితో కస్టడి గడువు ముగియనుండంతో కస్టడీ పొడిగించాలంటూ కోర్టును ఆశ్రయించే అవకాశాలున్నాయి. మొదటి రోజు పోలీసులు కస్టడీ ముగిసిన తరువాత బయటకు వస్తూ ,తానే తప్పు చేయలేదని, రాజస్థాన్ దంపతులు బిడ్డను దత్తత అడిగితే ,ఏర్పాటు చేశామంటూ చెప్పింది కేసులో ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రత. కానీ ఆ తరువాత వేగంగా జరగుతున్న పరిణామాలు నిందితురాలు నమ్రత కావాలనే కేసును తప్పుదోవ పట్టించాలని చూస్తున్నట్లు తెలుస్తోంది.
ఐదురోజుల పాటు పోలీసు కస్టడిలో డాక్టర్ నమ్రత , పోలీసులకు ఏ మాత్రం సహకరించలేదని తెలుస్తోంది.
చెప్పిందే చెప్పడం, తాను

..మిగతా 2వ పేజీలో ➔










## 60 మంది గల్లంతు

**దశ, డెహ్రాడూన్:** ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలోని ధరలీ గ్రామంలో జరిగిన భారీ క్లౌడ్ బరస్ట్ కారణంగా భారీ వరదలు వచ్చాయి. మట్టిపెళ్లలు విరిగిపడి ధారాలి అనే గ్రామంలోని ఇళ్లు, హోటళ్లు, హోమ్‌స్టేలను తుడిచి పెట్టేశాయి. ఈ ఘటన ఖీర్ గంగా నది క్యాచ్‌మెంట్ ప్రాంతంలో సంభవించింది, దీనివల్ల గ్రామంలో తీవ్ర విధ్వంసం జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన భయానక వీడియోలను భారత సైన్యం విడుదల చేసింది. ఆగస్టు 5 మంగళవారం మధ్యాహ్నం 1:45 గంటల సమయంలో ఉత్తరకాశీ జిల్లాలోని హర్సిల్ సమీపంలోని ధరలీ గ్రామంలో, ఖీర్ గంగా నది క్యాచ్‌మెంట్ ప్రాంతంలో ఈ క్లౌడ్ బరస్ట్ సంభవించింది. ధరలీ గ్రామం గంగోత్రీకి సమీపంలోని ఒక ముఖ్యమైన స్టాప్‌ఓవర్ గ్రామం, ఇక్కడ అనేక హోటళ్లు, రెస్టారెంట్లు మరియు హోమ్‌స్టేలు ఉన్నాయి.

ఈ ఘటన వల్ల భారీ వరదలు , మట్టిపెళ్లలు విరిగిపడటం వల్ల గ్రామంలోని ఇళ్లు, దుకాణాలు , రోడ్లు పూర్తిగా నాశనమయ్యాయి.2025 హోటళ్లు మరియు హోమ్‌స్టేలు వరదల్లో కొట్టుకుపోయాయని చెబుతున్నారు. అందులో పర్యాటకులు ఎంత మంది ఉన్నారు అన్నదానిపై ఇంకా సమాచారం లేదు. వంద మంది వరకూ ఉండవచ్చని అంటున్నారు.



## విద్యుత్ తీగలకు చుట్టుకున్న నాగుపాము.. షార్ట్ సర్క్యూట్ తో వస్త్ర దుకాణం దగ్ధం

**దశ, జయశంకర్ భూపాలపల్లి:** నాగుపాము చేసిన ఓ వస్త్ర వ్యాపారికి భారీ ఆస్తి నష్టం జరిగింది. పాము విద్యుత్ స్తంభం ఎక్కి రెండు తీగలను తాకడంతో షార్ట్ సర్క్యూట్ జరగడంతో వస్త్ర దుకాణం దగ్ధమైంది. ఈ సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల కేంద్రంలో జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... టేకుమట్ల మండల కేంద్రంలో శ్రీనివాస్ అనే వ్యక్తి 15 ఏళ్లుగా వస్త్ర వ్యాపారం చేస్తున్నాడు. దుకాణంపైన ఫోర్షన్‌లో తన కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. ఆదివారం రాత్రి దూకాణం మూసి ఇంటికి వెళ్లాడు.దుకాణం పక్కన ఉన్న విద్యుత్ స్తంభంపైకి నాగుపాము ఎక్కింది. నాగుపాము తీగలను తాకడంతో షార్ట్ సర్క్యూట్ జరగడంతో దుకాణంలో మంటలు చెలరేగాయి. స్థానికుల సహాయంతో మంటలను ఆర్పడానికి ప్రయత్నించాడు. కానీ సాధ్యం కాకపోవడంతో అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే దుకాణంలో దుస్తులు, నగదు, ఫర్నీచర్ పూర్తిగా దగ్ధమయ్యాయి. స్తంభం పైనే పాము చనిపోయింది. రూ.50 మేర ఆస్తి నష్టం జరిగినట శ్రీనివాస్ వాపోయాడు. తనని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు

## పుట్టపాక చేనేత చీరకు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు

**మాజీ సర్పంచ్, చేనేత కార్మికుడు సామల భాస్కర్ కు అభినందనలు**



**దశ, ఎల్బీనగర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామంలో సామల భాస్కర్ తయారు చేసిన చేనేత చీరకు తెలంగాణ ప్రభుత్వం కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు ప్రకటించింది. అవార్డుకు ఎంపికైన చీర పేరు గార్డెస్ ఆఫ్ పికాక్ ఇక్కత్ హ్యాండ్లూమ్ సట్టిన్ శారీ. ఈ సందర్భంగా చీరను నేసిన చేనేత కార్మికుడు, మాజీ సర్పంచ్ సామల భాస్కర్ మాట్లాడుతూ... మార్కెట్లో తయారయ్యే సాధారణ చీరలు అమ్మకాలు సరిగా లేక చేనేత కళాకారుల జీవనోపాధి క్లిష్టంగా మారిందన్నారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని చేనేత చీరలు వినూత్నంగా ఉండాలనే ఆలోచనతో నెమలి దేవత ఉన్న డిజైన్ రూపొందించినట్లు తెలిపారు. పికాక్ డిజైన్ ఉన్న చీర కొంగు వెయ్యి మెట్లు, బాడీ డిజైన్ 450 మెట్లతో గ్రాఫ్ రూపొందించి, నిలువు డిజైన్ సాదా, పేక డిజైన్ 3డీ ఎఫెక్ట్ మాదిరిగా డిజైన్ చేసినట్లు తెలిపారు. నాలుగు అచ్చులతో రెండున్నర కొలుకులతో బాడీ డిజైన్, కొలికినరతో కొంగు వెప్ట డిజైన్ తో టస్సారు, ఎల్లో, బ్రౌన్, గ్రీన్, రాయల్ బ్లూ, రెడ్, బ్లాకు ఏడు రంగులతో అద్దకం చేసి స్పెషల్ గా చీర తయారు చేశానని వివరించారు. వినూత్నంగా తయారు చేసిన చేనేత చీర నైపుణ్యాన్ని గుర్తించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు ప్రకటించినట్లు ఆయన తెలిపారు. అవార్డు ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సామల భాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు. అవార్డుకు ఎంపికైన భాస్కర్ ను చేనేత కార్మికులు, వివిధ పార్టీల నాయకులు అభినందనలు తెలిపారు.

## తాళాలు వేసిన బైక్ లే టార్గెట్..

**బైక్ లను దొంగతనం చేసిన నేరస్తుని అరెస్టు చేసిన పోలీసులు**

**వివరాలను వెల్లడించిన షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ**

**దశ, రంగారెడ్డి:** షాద్ నగర్ నియోజకవర్గ మరియు ఇతర పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనం చేసిన నేరస్థుని షాద్ నగర్ పోలీసులు అరెస్టు చేశారు. 19 తారీకు 2025 నాడు ఆర్టిసి బస్సు సమీపంలో కొరియర్ దగ్గర బైక్ ను పార్కుచేసిన వాహనమును ఎవరో గుర్తు తెలియని వ్యక్తి దొంగలించినట్లు షాద్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. నరసింహులు ఇచ్చినా ఫిర్యాదు మేరకు షాద్ నగర్ క్రైమ్ సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. టెక్నికల్ ఆధారంగా వినోద్ ని విచారణ చేపటగా పార్కు చేసిన బైక్ లే లక్ష్యంగా బైక్ హ్యాండిలను విరగొట్టి దొంగతనాలు చేపడుతున్నట్లు పోలీసులకు వెల్లడించారు. నిందితుడు వినోద్ తండ్రి నీలయ్య వయసు 30 సంవత్సరాలు లంబాడి కులస్తుడు ఇన్ముల్ నర్వ



కొత్తూరు మండలానికి చెందినవాడు. ఇతడు షాద్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు ద్విచక్ర వాహనాలు, ఆర్.జి.ఐ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక్క ద్విచక్ర వాహనం, కొత్తూరు పిఎస్ పరిధిలో నాలుగు ద్విచక్ర వాహనాలు, అఫ్జల్ గంజ్ పిఎస్ పరిధిలో రెండు ద్విచక్ర వాహనాలు మొత్తం 11 బైకులును అదేవిధంగా రెండు లక్షల నగదును దొంగతనం చేసి జైలుకి వెళ్ళొచ్చినట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా కేసు చేదనలో శంషాబాద్ డీసీపీ రాజేశ్, అడిషనల్ డీసీపీ కె.పూర్ణచందర్,మరియు షాద్ నగర్ ఏసిపి ఎస్. లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో పి విజయ్ కుమార్, ఇన్.స్పెక్టర్, ఎస్ వెంకటేశ్వర్లు,డిఐ ఆధ్వర్యంలో కేసు విచారణాదికారి, క్రైమ్ ఎస్ ఐ జి శివ రెడ్డి క్రైమ్ కానిస్టేబుల్ రవీందర్, సంతోష్ ,కర్ణాకర్, జాకీర్ మరియు రాజు కేసు ను ఛేదించడంలో కీలక పాత్ర పోషించినట్లు వెల్లడించారు.వారికి తగిన రివార్డ్ లను పై అదికారుల ద్వారా ఇప్పించడం జరుగుతుంది ఏసిపి వెల్లడించారు.



## ఘనంగా తెలంగాణ క్రైస్తవ కళాకారుల ఆవిర్భావ సభ

**దశ, తార్నాక :** క్రైస్తవుల హక్కుల పరిరక్షణకు కలిసికట్టుగా కృషి చేయాలని అడిషనల్ మాజీ డిజిపి బాబురావు, ఎన్సిసి రాష్ట్ర అధ్యక్షులు బిషప్ సంజయ్ ఆనంద్ తదితరులు అన్నారు. మంగళవారం గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని జ్యోతి నగర్ కమ్యూనిటీ హాల్లో తెలంగాణ క్రైస్తవ కళాకారుల వేదిక ఆవిర్భావ సభ ఘనంగా జరిగింది. తెలంగాణ క్రైస్తవ కళాకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు గొంగళ్ళ సునీల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అడిషనల్ మాజీ డిజిపి బాబురావు ఎన్సిసి రాష్ట్ర అధ్యక్షులు బిషప్ సంజయ్ ఆనంద్ ఎన్సిసి రాష్ట్ర కార్యదర్శి బక్క ఏలియాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో క్రైస్తవుల హక్కుల సాధనకై అందరూ కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. క్రైస్తవులపై జరుగుతున్న దాడులను త్రిప్పి కొట్టడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం తెలంగాణ క్రైస్తవ కళాకారుల వేదిక రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



## "అస్తిత్వకేతనం"

త్యాగాల పోరుగడ్డపై
అస్తిత్వం కేతనమై ఎగిరింది
నిర్బంధం, నిరంకుశత్వం
మోసంతో స్వేచ్ఛను బంధిస్తే
కపట బుద్ధుల దురాలోచనను
కొదమసింహం చిన్ననాడే
ప్రశ్నించింది
విషం చిమ్మే మనుషులు
పెదాలపై నవ్వును
అతికించుకొని వస్తే
వలస పాలన కుతంత్రంపై
ఉడుకు రక్తం ఉప్పెనైంది
విశాలాంధ్ర ముసుగులో
ఇడ్లీసాంబార్ల రుచిజూపి
నాన్ ముల్కీలు మన
గట్కదోస్తుంటే
సహించని చైతన్యం
తిరగబడింది
బలిదానాలను
తలుచుకొన్నప్పుడల్లా
ఆ గుండెపొరల్లోంచి రక్తం
ఆరిపోని ఆశయమై ఎగసింది
దశాబ్దాల నివురుగప్పిన
చరితను యాది మరువకుండా
తరతరాల తలరాతలకు రాసిన
నిప్పులకొలిమి నిత్యం మండింది
రాలిపోయేవరకు రాజీపడని
వ్యక్తిత్వం
అలుపెరుగని పోరు లో
ఆత్మగౌరవాన్ని శ్వాసించింది.

*( ఆగస్టు 6 న ప్రొఫెసర్ జయశంకర్ గారి జయంతి సందర్భంగా....)*

డాక్టర్ చింతల రాకేశ్ భవాని
9246607551

# వర్షాకాలం మధ్య భానుడి భగభగలు

- ❖ వ్యవసాయ కూలీలకు నరకయాతన
- ❖ ఎండ వేడిమితో కూలీలు కుప్పకూలుతున్న వైనం
- ❖ వరి నాట్లకు అంతరాయం



**సూర్యాపేట ప్రతినిధి :** వర్షాకాలం నడుమా ఎండలు మండిపోతుండటంతో వ్యవసాయ రంగం తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. పగటి వేళల్లో భానుడి భగభగలు చల్లబడే ఆసరా లేకుండా మండిపోతుండటంతో, పొలాల్లో పని చేస్తున్న కూలీలు ఒకరొక్కరు సమ్మసిల్లి కుప్పకూలిపోతున్నారు. ముఖ్యంగా వరి నాట్ల సమయం కావడంతో పనులు అత్యవసరంగా సాగాల్సిన పరిస్థితిలో రైతులు అవస్థలు పడుతున్నారు. ఎండ తీవ్రతతో ఒక్క పూట పని చేయడమే అసాధ్యమైపోతోంది. సాధారణంగా 10-12 మందితో చేసే వరి నాట్లు ఇప్పుడు గుంపుకు ఇద్దరు లేదా ముగ్గురు మాత్రమే మిగలుతున్నారు. పలువురు తీవ్ర వడదెబ్బకు గురై చికిత్స తీసుకుంటుండగా, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి అయితే పొలాల్లోకి వెళ్లే పరిస్థితి లేదు. వర్షాకాలంలోనూ మామూలు కన్నా ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావడాన్ని చూసి ప్రజానీకం ఆశ్చర్యపోతున్నారు. వాతావరణ విపరీత పరిస్థితులు ఉచిత సేవలతో అందుతున్నప్పటికీ, ఆయా హెచ్చరికలను అమలు చేయకపోవడం వల్లనే ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

# క్విట్ ఇండియా స్ఫూర్తితో...

- ❖ బహుళ జాతి కంపెనీలు దేశాన్ని విడిచి వెళ్లేంతవరకు పోరాడుదాం
- ❖ ఏఐకేఎంఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి.కోటేశ్వరరావు




**దశ సూర్యాపేట ప్రతినిధి ఆగస్టు 5 :** విదేశీ బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఇండియాను వదిలి వెళ్లాలని "డూ ఆర్ డై" నినాదంతో క్విట్ ఇండియా ఉద్యమాన్ని బొంబాయిలో గాంధీ 1942 ఆగస్టు 9 న ప్రారంభించారని, కులాలు మతాలకు అతీతంగా ప్రజలు ఏకమయ్యారు. దీనితో బ్రిటిష్ వాడు ప్రత్యక్షంగా ఈ దేశాన్ని విడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఏఐకేఎంఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి. కోటేశ్వరరావు అన్నారు. ఏఐకేఎంఎస్, ఐఎఫ్ టి యు, పిడిఎస్ యు ,పి వై ఎల్, పి ఓ డబ్ల్యు, అరుణోదయ ప్రజాసంఘాల సమావేశం ఈరోజు సూర్యాపేట జిల్లా కేంద్రంలో చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రం నందు నిర్వహించారు.

ఈ సందర్భంగా వి. కోటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ. భారతదేశంలో విదేశీ బహుళ జాతి కంపెనీలైనా అమెజాన్, వాల్ మార్ట్, ఓలా, ఉబర్, సింగ్వి , మోనో లాంటి సంస్థలు ఆహారం నుండి అన్ని రకాల వస్తువుల వరకు విక్రయిస్తూ దోపిడీ చేస్తున్నాయని దీనికి ఈ దేశ కార్పొరేట్ సంస్థలు దళారీలుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం. డేవిడ్ కుమార్, ఐఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, ఐ ఎఫ్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు, అరుణోదయ జిల్లా అధ్యక్షులు ఉదయగిరి, పి వై ఎల్ జిల్లా అధ్యక్షులు నల్లగొండ నాగయ్య, ప్రధాన కార్యదర్శి డి.రవి, పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు పుల్లూరి సింహాద్రి, పి ఓ డబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నరసమ్మ, అరుణోదయ ఉపాధ్యక్షులు బొల్లి వెంకన్న, సహాయ కార్యదర్శి ఎర్ర ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలి

- ❖ కమిషనర్ హన్మంతరెడ్డి

**దశ సూర్యాపేట ప్రతినిధి :** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాల్సిన అవసరం ఉందని సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి అన్నారు. అమృత మిత్ర ఉమెన్ ఫర్ ట్రీస్ ఆధ్వర్యంలో వంద రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక పుల్లారెడ్డి చెరువు వద్ద నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ హన్మంతరెడ్డి మాట్లాడుతూ పట్టణాల్లో పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, టీఎంసీ శ్వేత, ఎన్విరాన్ మెంట్ ఇంజనీర్ శివ ప్రసాద్, వసుంధర, వసీమ్, గోనె విజయ అమృత మిత్ర ఉమెన్ ఫర్ ట్రీస్ సభ్యులతో పాటు, మహిళా సంఘాలు, విద్యార్థినులు, పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో వన మహోత్సవం

**దశ, నాచారం :** వన మహోత్సవంతో తెలంగాణ రాష్ట్రంలో మరింత పచ్చదనం పెరుగుతుందని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పరమేశ్వర్ రెడ్డి అన్నారు. మాజీ సైనికుడు కాంగ్రెస్ పార్టీ నాయకుడు సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో నాచారం డివిజన్లో వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పరమేశ్వర్ రెడ్డి మొక్కలను నాటి అనంతరం కాలనీవాసులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 79 వేల మొక్కలను నాటేందుకు సిద్ధమైన మాజీ సైనికులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. మాజీ సైనికుడు సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి శ్రీధర్ బాబు సూచన మేరకు 79వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని 30 వేల మంది మాజీ సైనికులు జిహెచ్ఎంసి పరిధిలో 79 వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, నాచారం డివిజన్ కాంగ్రెస్ నాయకులు, ఎస్ ఎస్ ఎస్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.



## జంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



**దశ, సూర్యాపేట ప్రతినిధి:** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పెద్ద మసీదు ముందు జరుగుతున్న జంక్షన్ అభివృద్ధి పనులను మున్సిపల్ కమీషనర్ సిఎచ్.హన్మంత రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లు తమకు కేటాయించిన పనులను నాణ్యత ప్రమాణాలతో చేయాలన్నారు. జంక్షన్ అభివృద్ధికి సంబంధించి పలు సూచనలు చేశారు. అయన వెంట మున్సిపల్ డి.ఇ సత్యారావు, సానిటరీ ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్టు

**దశ, ఎల్బీనగర్ :** చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు, ఎల్బీనగర్ ఎస్వోటీ పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న 10 మందితోపాటు రూ, 51 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు... సోమవారం రాత్రి 8 గంటల సమయంలో చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని సమతాపురి కాలనీలో సాయిరాం రెసిడెన్సీ ఫ్లాట్ నెంబర్ 103లో కొందరు పేకాట ఆడుతున్నారు. సమాచారం తెలుసుకున్న చైతన్యపురి పోలీసులు, ఎస్వోటీ పోలీసులు దాడి చేసి, పేకాట ఆడుతున్న మందిని ఆరెస్టు చేశారు. వీరిలో పవన్ గౌడ్, గురిజ హరికృష్ణ, గుండు సత్తయ్య, దిద్దిగె వేణు, తాండ బాలకృష్ణ, కొండపాక ప్రదీప్, చెరుకూరి శ్రీధర్ గౌడ్, బి.కిరణ్ కుమార్, షేక్ ముక్సిద్ భాషాను అదుపులోకి తీసుకున్నారు. పేకాట కార్డులు, 11 సెల్ ఫోన్లు, గేమింగ్ కాయిన్స్, రూ, 51,090 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## సేవా కార్యక్రమాలలో వాసవి క్లబ్ ముందంజ

**దశ సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 5 :** వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ రీజన్ ఫిఫ్త్ జోన్ వన్, సుధాకర్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఫ్రెండ్ షిప్ డే వేడుకల్లో భాగంగా వాసవి వారి శ్రీమంతం వేడుక చూద్దాం రారండి.. అంటూ 104 మంది గర్భిణీ మహిళలకు సామూహిక శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని క్లబ్ సభ్యులు సూర్యాపేట సిడిపిఓ సుబ్బలక్ష్మి, సూపర్వైజర్ల సహకారంతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ డిస్టిక్ గవర్నర్, డైమండ్ స్టార్ కేసిజిఎఫ్ రాచకొండ విజయలక్ష్మి మాట్లాడుతూ.. వాసవి క్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని అందులో భాగంగా ఈరోజు సామూహిక శ్రీమంతల కార్యక్రమం చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణీ మహిళలకు గాజులు పూలు పండ్లు స్వీట్ ప్యాకెట్, పసుపు కుంకుమ, చీర జాకెట్ ముక్కలు అందజేశారు. సుధాకర్ విజన్ క్లబ్ ప్రెసిడెంట్ దాచేపల్లి సంధ్య ,వంగవేటి సుజాత సెక్రటరీ, బూర్ల జ్యోతి ట్రెజరర్ , చల్లా లక్ష్మయ్య జోన్ 1 చైర్మన్, మిరియాల సుధాకర్ క్యాబినెట్ సెక్రటరీ బిక్కుమల్ల కృష్ణ, క్యాబినెట్ సెక్రటరీ వెంపటి శబరినాథ్ పలువురు ఐపిసిలు, ఐఇసిలు పాల్గొన్నారు.

## కెమికల్ వ్యర్థాలను అరికట్టాలి

- ❖ ఎమ్మెల్యేకు సెవెన్ కాలనీస్ జేఏసీ నాయకుల వినతి



**దశ, ఎల్బీనగర్ :** మన్సూరాబాద్ డివిజన్ లోని వివిధ కాలనీల్లో ప్రవహిస్తున్న కెమికల్ వ్యర్థాలు, డ్రైనేజీ నీరు పారకుండా అరికట్టాలని వివిధ కాలనీల సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో మన్సూరాబాద్ డివిజన్ లోని సెవెన్ కాలనీ జాయింట్ యాక్షన్ కమిటీ(సెవెన్ హిల్స్ కాలనీ, స్వాతి గార్డెన్స్, ద్వారక నగర్, డీపీనగర్, హిమపురి కాలనీ 1&2, సౌత్ ఎండ్ పార్క్) సభ్యులు కలిశారు. పలు సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వరద కాల్వలో మూడు నెలలుగా వస్తున్న కెమికల్ వ్యర్థాలు, డ్రైనేజ్ నీరు వస్తున్నట్లు తెలిపారు. మరుగునీరు, కెమికల్ వ్యర్థాలతో ఏడు కాలనీల ప్రజలు తీవ్రమైన అస్వస్థతకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రిపూట కెమికల్ వ్యర్థ రసాయనాలు పోసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... ఆయా కాలనీల్లో గతంలో అధికారులు పర్యటించి, ప్రతి నిర్మాణాన్ని పరిశీలించారన్నారు. అలాగే కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించినట్లు గుర్తు చేశారు. అధికారులు తిరిగి ఆయా కాలనీల్లో పర్యటించి, కెమికల్ వ్యర్థాలు రాకుండా చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. నూతన డ్రైనేజీ నిర్మాణాలపై అధికారులతో చర్చిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, అధ్యక్షులు కత్తుల రాంబాబు, కమలాకర్ రావు, బోగోజు మధు, ప్రవీణ్, అజయ్, జనార్దన్, కిశోర్, కృష్ణయ్య, శ్రీనివాస్, రమేష్, జయరాంరెడ్డి, సైదులు, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు మరణించడంతో అనాధలైన బాలికలు

- ❖ దిక్కు తోచని స్థితిలో అపన్నహస్తం కోసం ఎదురుచూపు



**దశ, తుంగతుర్తి:** సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలోని (కొత్త)ఎస్సీ కాలనీకి చెందిన తడకమల్ల రాములమ్మ తేదీ.30 122023 తారీఖున క్యాన్సర్ వ్యాధితో మరణించింది. వారి పెద్ద పాప ఉమ ఇంటర్మీడియట్ పాస్ అయింది. చిన్న పాప శ్రీజ ఆరో తరగతి చదువుతుంది. ఇంతలోనే తండ్రి అనారోగ్యంతో మంచానికి పరిమితమయ్యాడు. కుటుంబ భారం పెద్ద కూతురు ఉమ మీద పడింది. చదువు మధ్యలోనే మానేసి కూలి నాలి పనులకు వెళ్లి వాళ్ళ నాన్నను చెల్లిని పోషించానని ఆవేదన వ్యక్తం చేసింది. ఇంతలోనే జులై 30వతేదీన తన తండ్రి తడకమల్ల (పెద్ద) వెంకన్న, మరణించడంతో ఇద్దరం అనాదలం అయ్యామని కన్నీరు మున్నీరయ్యారు. దాతలు ముందుకు వస్తే మేము చదువుకుంటామని కంటతడి పెట్టారు. ఈ సంఘటన గ్రామస్తులను కంటతడి పెట్టించింది.



కుషాయిగూడ కూరగాయల మార్కెట్ పునర్నిర్మాణ పనులు శాంక్షన్ అయినా సందర్భంగా మంగళవారం ఉప్పల్ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి , జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ కలిసి మార్కెట్ పై కప్పు పనుల కోసం సంబంధిత ప్రొసీడింగ్స్ ను మార్కెట్ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ ,మార్కెట్ కమిటీ సభ్యులు, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

-(దశ , మేడ్చల్ మల్కాజిగిరి)

## ఎన్ ఆర్ ఐలనూ ముంచేశారు

మొదటి పేజీ తరువాయి..

తప్పు చేయలేదని నమ్మించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ కేసులో ప్రమేయం ఉన్న మరో డాక్టర్ విజ్జులతను విదేశాలకు పారిపోతుండగా సి ఐ ఎస్ ఎఫ్ పోలీసులు శంషాబాద్ ఎయిర్ పోర్టులో అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికే విజ్జులతకు లుక్ అవుట్ నోటీసులిచ్చిన పోలీసులు ,పాస్ పోర్టు ఎంట్రీ ఆధారంగా గుర్తించి, విదేశాలకు పారిపోకుండా ఆపగలిగారు. డాక్టర్ నమ్రతతో కలసి సరోగసి, ఐవిఎఫ్ లను విజ్జులత నిర్వహించేవారని తేలింది. సరోగసి కోసం వచ్చే దంపతుల వద్ద లక్షల రూపాయలు వసూలు చేస్తున్న నమ్రత తనపై ఎవరికీ అనుమానం రాకుండా , సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ అనుమతులు విజ్జులత పేరుతో తీసుకున్నట్లుగా విచారణలో తేలింది. తాజాగా నమ్రతతోపాటు సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ బ్యాంక్ ఖాతాలను పరిశీలించిన అధికారులు, 2019 నుండి 2025 మధ్య భారీగా వీరి ఖాతాలో నగదు క్రెడిట్ అయినట్లుగా గుర్తించారు. దాంతో వీరి బ్యాంక్ ఖాతాలను కూడా ఫ్రీజ్ చేసే అవకాశాలున్నాయి. ఇన్నాళ్లు రాజస్థాన్ దంపతులు మాత్రమే బయటకు రాగా, తాజాగా మరో ఐదుగురు బాధితులు తామూ సరోగసి పేరుతో నమ్రతా చేతిలో మోసపోయామంటూ పోలీసులను ఆశ్రయించారు. సరోగసి పేరుతో నల్గొండకు చెందిన దంపతుల వద్ద నుండి 11 లక్షలు వసూలు చేయగా, ఓ ఎన్ ఆర్ ఐ వద్ద నుండి 19లక్షలు తీసుకున్నారు.హైదరాబాద్ లో ఓ జంట వద్ద నుంచి 16.5లక్షలు వసూలు చేశారు. మరో జంట వద్ద 12.5 లక్షలు వసూలు చేశారు. పిల్లలు లేని దంపతులు సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కు వస్తే చాలు , సరోగసి వద్దు, ఐవిఎఫ్ ముద్దంటూ మాయమాటలు చెప్పి, నమ్మించి కోట్లాది రూపాయలు సంపాదిస్తున్నారు. ఓవైపు డాక్టర్ నమ్రతను విచారిస్తూనే, కేసుతో సంబంధం ఉన్న మరో ఐదుగురు నిందితులను కూడా వేరువేరుగా విచారిస్తున్నారు. ఇప్పటికే సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ లలో వరుస తనిఖీలు నిర్వహించిన పోలీసులు ,పలు కీలక ఆధారాలను సేకరించినట్లు సమాచారం.